# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి: 20 సంచిక : 283 | ఆదివారం 28, జూన్ 2026 | పేజీలు: 4 | వెల: రూ.1

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR CELL : 8008609999


# ఇందిరమ్మ ఇళ్ల శ్లాబ్ సైజుపై కొత్త నిబంధనలు

## 500 నుంచి 750 చదరపు అడుగులకే శ్లాబ్ పరిమితం

శ్లాబ్ విస్తీర్ణంపై తెలంగాణ ప్రభుత్వం కీలక జీవో
ముందు వైపు 3 అడుగులు.. మిగతా వైపులా ఒక్క అడుగే
గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఉత్తర్వులు
లబ్ధిదారులపై అదనపు భారం తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం
శ్లాబ్ విస్తీర్ణం పెరగడంతో నిర్మాణ వ్యయం అధికమవుతున్నట్లు గుర్తింపు
ఏకరీతి నమూనాతో ఇళ్ల నిర్మాణానికి మార్గదర్శకాలు
ప్రభుత్వ నిధుల సద్వినియోగానికి కొత్త నిబంధనలు
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వ్యయ నియంత్రణకు ప్రాధాన్యం
కొత్త నిబంధనలు రాష్ట్రవ్యాప్తంగా అమలు

ప్రజాస్వరం, హైదరాబాద్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో శ్లాబ్ విస్తీర్ణానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇళ్ల నిర్మాణ వ్యయం పెరగకుండా, లబ్ధిదారులపై అదనపు ఆర్థిక భారం పడకుండా ఉండేలా శ్లాబ్ సైజుపై స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు గృహనిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఉత్తర్వులు విడుదల చేశారు. కొత్త నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్ల శ్లాబ్ విస్తీర్ణం 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్య మాత్రమే ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అలాగే శ్లాబ్‌కు ఇంటి ముందు భాగంలో గరిష్ఠంగా మూడు అడుగుల ప్రొజెక్షన్ (ఓవర్‌హ్యాంగ్) ఉండగా, మిగతా మూడు వైపులా ఒక్క అడుగు మాత్రమే ఉండాలని పేర్కొంది.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు పక్కా ఇళ్లు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుండగా, లబ్ధిదారులు కూడా కొంత మొత్తం భరించి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారు. అయితే ఇటీవల కొన్ని ప్రాంతాల్లో మిగతా 7లో..



# మూడు రాష్ట్రాల సీఎంల భేటీ వివరాలు వెల్లడించాలి

హోస్పేట భేటీపై శ్వేతపత్రం విడుదల చేయాలి
రహస్య ఒప్పందాల వివరాలు ప్రజలకు చెప్పాలి
శాసనసభలో ఒప్పందాలను ప్రవేశపెట్టాలి
కర్ణాటకతో కుమ్మక్కయ్యారని ఆరోపణ
అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్
ఉత్తమ్, అధికారులను బయటే ఉంచారని విమర్శ
తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్న ఆందోళన
చంద్రబాబు మాటే కేంద్రం వింటోందని వ్యాఖ్య
ఓటమి భయంతో నిజాలు దాస్తున్నారన్న విమర్శ
తెలంగాణకు అన్యాయం జరిగితే ఊరుకోబోమని హెచ్చరిక



ప్రజాస్వరం, హైదరాబాద్

మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య కర్ణాటకలో జరిగిన భేటీలో ఏం చర్చించారో, ఎలాంటి ఒప్పందాలు కుదిరాయో ప్రజలకు వెల్లడించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. చారిత్రక ఒప్పందం జరిగిందని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆ ఒప్పందాల పూర్తి వివరాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. శనివారం మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు.. కర్ణాటక ప్రభుత్వంతో రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారనే అనుమానం వ్యక్తం చేశారు. మూడు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాలను శాసనసభలో ప్రవేశపెట్టి చర్చించాలని డిమాండ్ చేశారు. కర్ణాటకతో జరిగిన ఒప్పందాలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. హోస్పేటలో జరిగిన సీఎంల సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులను బయట కూర్చోబెట్టారని హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవిష్యత్‌కు సంబంధించిన అంశాలను కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేతిలో ఎలా పెడతారని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఏది చెబితే కేంద్ర ప్రభుత్వం అదే వింటోందని హరీశ్‌రావు విమర్శించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగితే బీఆర్ఎస్ ఊరుకోదని హెచ్చరించారు. రాష్ట్ర దీర్ఘకాలిక ప్రయోజనాలను మిగతా 7లో..

# ప్రజలపై పన్నుల భారం.. పెట్రోల్ ధరలపై కేంద్రాన్ని నిలదీసిన ఖర్గే

అంతర్జాతీయంగా క్రూడ్ ధరలు తగ్గినా దేశంలో రేట్లు తగ్గట్లేదన్న ఖర్గే
ప్రజలను పన్నుల వసూలు వనరులుగా చూస్తున్నారని కేంద్రంపై విమర్శ
గతంలో కంటే క్రూడ్ ధరలు తగ్గినా ప్రయోజనం లేదని ఆరోపణ





ప్రజాస్వరం, హైదరాబాద్

అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు భారీగా తగ్గినప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను ఎందుకు తగ్గించడం లేదని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజలను కేవలం పన్నులు వసూలు చేసే వనరులుగానే పరిగణిస్తోందని ఆయన ఆరోపించారు.
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నేపథ్యంలో ముడి చమురు బ్యారెల్ ధర 138 డాలర్లకు చేరినప్పుడు, దేశంలో లీటర్ పెట్రోల్ ధర సుమారు రూ. 94.77గా ఉండేదని ఖర్గే గుర్తుచేశారు. ప్రస్తుతం క్రూడ్ ధర 70 నుంచి 82 డాలర్ల మధ్య ఉన్నప్పటికీ, దేశీయంగా పెట్రోల్ ధర రూ. 101 111, డీజిల్ ధర రూ. 95 100 మధ్య కొనసాగడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా ధరలు తగ్గినప్పుడు ఆ ప్రయోజనాన్ని మిగతా 7లో..

# కేతన్ హత్య కేసులో షాకింగ్ ట్విస్ట్

పెళ్లి తప్పించుకోవడానికే హత్యకు కుట్ర?
ప్రియుడితో కలిసి పథకం రచించిన సియా
ఆరు బృందాలతో దర్యాప్తు ముమ్మరం
సియా కుటుంబ సభ్యుల విచారణ కొనసాగింపు
రెండోసారి సోదరుడిని విచారించిన పోలీసులు
క్రికెట్ మ్యాచ్‌లో చేతన్‌తో పరిచయం
2 వేలకుపైగా కాల్స్ గుర్తించిన పోలీసులు
238 గంటలు మాట్లాడుకున్నట్లు వెల్లడి
డిలీట్ చేసిన డేటా రికవరీకి ప్రయత్నాలు

ప్రజాస్వరం, హైదరాబాద్

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పుణె యువ రియల్టర్ కేతన్ అగర్వాల్ (26) హత్య కేసు దర్యాప్తు రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. ఈ కేసులో తాజాగా వెలుగులోకి వచ్చిన అంశాలు మరింత సంచలనం రేపుతున్నాయి. కేతన్‌ను వివాహం చేసుకోవడం ఇష్టం లేకపోవడంతో సియా గోయల్ తన ప్రియుడు చేతన్ చౌదరితో కలిసి హత్యకు పథకం రచించినట్లు పోలీసు విచారణలో వెల్లడైనట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. పుణె రూరల్ పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. కుటుంబ సభ్యులకు తాను మిగతా 7లో..





# వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించం

రైతులు, గ్రామీణ పేదలకు తీవ్ర నష్టం కలిగించే చట్టమని వ్యాఖ్య
తెలంగాణ క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో విస్తృత చర్చ
చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లే యోచన
కేరళ, కర్ణాటకతో కలిసి ఉమ్మడి కార్యాచరణకు నిర్ణయం
రైతుల హక్కులను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ
పేదల భవిష్యత్‌ను తాకట్టు పెట్టే చట్టమని విమర్శ
అమలుపై ప్రభుత్వం న్యాయపరమైన అవకాశాల పరిశీలన
మంత్రులు సీతక్క, తుమ్మల, వివేక్ హాజరు
తదుపరి కార్యాచరణపై త్వరలో తుది నిర్ణయం
ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమన్న ఉత్తమ్



ప్రజాస్వరం, హైదరాబాద్

వీబీజీ రామ్‌జీ చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ చట్టం రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉందని, వారి ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు, పేదల భవిష్యత్‌కు భంగం కలిగించే ఏ చట్టాన్నీ తెలంగాణ ప్రభుత్వం మిగతా 7లో..

# హైదరాబాద్‌లో రోహింగ్యాలు..

ఎవరెన్ని కుట్రలు చేసినా ఎస్ఐఆర్ ఆగదు: కిషన్‌రెడ్డి
నగరంలో అక్రమ రోహింగ్యాలు ఉన్నారని కేంద్ర మంత్రి ఆరోపణ
పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన వారికి ఓటరు కార్డులున్నాయని వ్యాఖ్య
పాతబస్తీలో బీఎల్‌వోలను మజ్లిస్ నేతలు బెదిరిస్తున్నారని విమర్శ
ఓటరు జాబితా సవరణను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణ
కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపాటు
ఎవరెన్ని కుట్రలు చేసినా ఎస్ఐఆర్ ప్రక్రియ ఆగదని స్పష్టం
రామ్‌కోఠిలో కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించిన కేంద్ర మంత్రి
చిన్నారులకు పాఠ్యపుస్తకాల పంపిణీ
ఖైరతాబాద్‌లో ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన కిషన్‌రెడ్డి
అక్రమ చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్



ప్రజాస్వరం, హైదరాబాద్

నగరంలో పెద్ద సంఖ్యలో రోహింగ్యాలు అక్రమంగా నివసిస్తున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆరోపించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి వచ్చిన కొందరికి హైదరాబాద్‌లో ఓటరు గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు, బ్యాంకు ఖాతాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.
శనివారం రామ్‌కోఠిలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కిషన్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం చిన్నారులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. తర్వాత ఖైరతాబాద్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మిగతా 7లో..


www.prajaswaramdaily.com
WWW.PRAJASWARAMDAILY.COM

# మూడు రాష్ట్రాల సీఎంల భేటీ వివరాలు వెల్లడించాలి

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దెబ్బతీస్తున్నారని ఆరోపించారు.

కాగా, ఈ నెల 25న కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని నూతన గేట్లను



ప్రారంభించారు.

# హైదరాబాద్‌లో రోహింగ్యాలు..

**మొదటిపేజీ తరువాయి**

ప్రారంభించారు.

అనంతరం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. పాతబస్తీలో బూత్ లెవల్ ఆఫీసర్లను (బీఎల్‌వోలు) మజ్లిస్ నేతలు బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రభావితం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్‌ఐఆర్)పై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఓటరు జాబితా ప్రక్షాళనను రాజకీయ రంగు పులమేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఎస్‌ఐఆర్ ప్రక్రియను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో అక్రమంగా పేర్లు నమోదైన వారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవడం ఎన్నికల సంఘం బాధ్యత అని కిషన్‌రెడ్డి అన్నారు.



అర్హులైన ప్రతి భారతీయుడికి ఓటు హక్కు ఉండాలని, అదే సమయంలో అక్రమంగా దేశంలోకి వచ్చిన వారి పేర్లు ఓటరు జాబితాలో ఉండకూడదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

# 'సర్'ను సీరియస్ గా తీసుకోం

- **మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న కేటీఆర్**
- **కార్యకర్తలు కదం తొక్కితే బీఆర్ఎస్‌కే మెజార్టీ వస్తుందని వెల్లడి**
- **రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా**



**ప్రజాస్వరం, హైదరాబాద్**

మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు.

రాష్ట్రంలో వికాసం పోయి విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలాయని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ కిట్ పోయి కరెంటు కోతలు వచ్చాయని.. రైతుబంధు పోయి 'రాహుల్ బంధు' వచ్చిందని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలకు పాతర వేసి, కుంభకోణాల జాతర నడిపిస్తున్నారని ఆరోపించారు.

మహేశ్వరంలో కార్యకర్తల జోష్ చూస్తుంటే సబితా ఇంద్రారెడ్డి గెలుపు, రాష్ట్రంలో గులాబీ జెండా ఎగరడం తథ్యమనిపించిందన్నారు. సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్నా.. జనం మాత్రం 50 ఏళ్ల సుదీర్ఘ అనుభవం ఉన్న కేసీఆర్‌నే తలుచుకుంటున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ బంగాళాఖాతంలో కలవడం పక్కా అని జోస్యం చెప్పారు. కార్యకర్తలే కథానాయకులై కదం తొక్కితే ప్రతి బూత్‌లో బీఆర్ఎస్‌కే మెజారిటీ వస్తుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల యుద్ధానికి ఇప్పటి నుంచే కేడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సర్ ప్రక్రియను సీరియస్ గా తీసుకోవాలని... అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

# రోడ్డును ఆక్రమించిన షెడ్ల కూల్చివేత

**మేడ్చల్ (ప్రజాస్వరం):**

రోడ్డు ఆక్రమణలపై అధికారులు కొరఢా ఝుళిపించారు.రోడ్డు స్థలాన్ని ఆక్రమించి రోడ్డును ఆనుకుని ఎలాంటి అనుమతులు లేకుండా మేడ్చల్ నుండి గండి మైసమ్మ పోయే దారితో పాటు హౌసింగ్ బోర్డ్ కాలనీ లో నిర్మించిన అక్రమ షెడ్లను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ సీపీ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపి మరియు టిపిఓ కూల్చివేశారు.రోడ్డు ని ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మిస్తే చర్యలు తప్పవన్నారు. ఇలాంటి అక్రమ కట్టడాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగడమే కాకుండా, పాదచారుల భద్రతకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల శ్లాబ్ సైజుపై కొత్త నిబంధనలు

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం నిర్మాణ వ్యయాన్ని నియంత్రించే దిశగా కొత్త మార్గదర్శకాలను తీసుకొచ్చింది.

లబ్ధిదారులు అనుమతించిన పరిమితికి మించి శ్లాబ్ విస్తీర్ణాన్ని పెంచుతున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ దృష్టికి వచ్చింది. దీంతో సిమెంట్, ఇనుము, కాంక్రీట్ తదితర నిర్మాణ సామగ్రి వినియోగం పెరిగి నిర్మాణ వ్యయం కూడా గణనీయంగా అధికమవుతోందని అధికారులు గుర్తించారు.

శ్లాబ్ విస్తీర్ణం పెరగడం వల్ల ప్రభుత్వం మంజూరు చేసే నిధులు సరిపోక, అదనపు ఖర్చు లబ్ధిదారులపై పడుతున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ ప్రభుత్వానికి నివేదించింది. చాలా మంది లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణం కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, దీని వల్ల ఇళ్ల నిర్మాణం ఆలస్యమవుతోందని కూడా అధికారులు పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొత్త ఉత్తర్వుల ప్రకారం శ్లాబ్ పరిమాణాన్ని నిర్ణీత ప్రమాణాలకు లోబడి నిర్మించాల్సి ఉంటుంది. ఇంటి ముందు భాగంలో మూడు అడుగుల వరకు మాత్రమే ప్రొజెక్షన్‌కు అనుమతి ఉంటుంది. ఇది వర్షపు నీరు నేరుగా గోడలపై పడకుండా ఉండటంతో పాటు ఇంటి ముందు భాగంలో కొంత రక్షణ కల్పించేందుకు ఉపయోగపడుతుంది. అయితే మిగతా మూడు వైపులా ఒక అడుగు కంటే ఎక్కువ ప్రొజెక్షన్ ఉండకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిబంధనలతో అవసరానికి మించిన నిర్మాణాలను నివారించి వ్యయాన్ని తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఒకవైపు నాణ్యతను కాపాడుతూనే మరోవైపు నిర్మాణ వ్యయాన్ని అదుపులో ఉంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇదే నమూనా అమలులో ఉండేలా జిల్లా కలెక్టర్లు, హౌసింగ్ అధికారులు, ఇంజినీర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొత్తగా నిర్మాణాలు ప్రారంభించే వారు తప్పనిసరిగా ఈ నిబంధనలను పాటించాలని సూచించారు.

ప్రభుత్వం నిర్దేశించిన నమూనాను అనుసరించడం వల్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు వ్యయ అంచనాలు కూడా ఒకే విధంగా ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రతి ఇంటికి అవసరమైన నిర్మాణ సామగ్రి పరిమాణాన్ని ముందుగానే అంచనా వేయడం సులభమవుతుందని, దీనివల్ల నిధుల వినియోగంలో పారదర్శకత కూడా పెరుగుతుందని భావిస్తున్నారు.

హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఇటీవల నిర్మాణ సామగ్రి ధరలు గణనీయంగా పెరిగాయి. సిమెంట్,



స్టీల్, ఇసుక, కంకర, కూలీల చార్జీలు పెరగడంతో ఇళ్ల నిర్మాణ వ్యయం కూడా పెరిగింది. ఈ పరిస్థితుల్లో శ్లాబ్ విస్తీర్ణాన్ని అవసరానికి మించి పెంచితే లబ్ధిదారులపై మరింత ఆర్థిక భారం పడే అవకాశం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. అందుకే నిర్మాణ వ్యయాన్ని నియంత్రించేందుకు ఈ పరిమితులు విధించినట్లు అధికారులు వివరించారు.

కొత్త నిబంధనల అమలుతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఏకరీతి ప్రమాణాలు పాటించే అవకాశం ఉంది. నిర్మాణ నాణ్యతను కాపాడుతూ, అనవసర వ్యయాన్ని తగ్గించడంతో పాటు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం సద్వినియోగం అయ్యేలా ఈ నిర్ణయం ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అలాగే లబ్ధిదారులు అదనపు అప్పుల భారం లేకుండా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకునేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వులు నిర్మాణ ప్రక్రియలో కీలక మార్పులకు దారితీయనున్నాయి. ఇకపై అన్ని కొత్త నిర్మాణాలు ఈ మార్గదర్శకాల ప్రకారమే చేపట్టాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# ప్రజలపై పన్నుల భారం.. పెట్రోల్ ధరలపై కేంద్రాన్ని నిలదీసిన ఖర్గే

**మొదటిపేజీ తరువాయి**

ప్రజలకు ఎందుకు బదిలీ చేయడం లేదని ప్రశ్నించారు.

బీజేపీ ప్రభుత్వం సామాన్యుల జేబులు ఖాళీ చేస్తూ ప్రజలను దోచుకుంటోందని ఖర్గే ధ్వజమెత్తారు. ప్రజలను కేవలం పన్నుల వసూలు సాధనంగానే కేంద్రం చూస్తోందని మండిపడ్డారు. యుద్ధ వాతావరణాన్ని సాకుగా చూపి కేంద్ర ప్రభుత్వం వాణిజ్య ఎల్పీజీ ధరలను రెట్టింపు చేసిందని, ప్రస్తుతం సరఫరా సాధారణ స్థితికి వచ్చినా ధరలను ఎందుకు తగ్గించడం లేదని ఆయన నిలదీశారు.

భారత్ తన చమురు అవసరాల్లో 85 శాతానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతుంది. గతంలో చమురు ధరలు పెరిగిన సమయంలో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు



భారీ నష్టాలను చవిచూశాయి. ప్రస్తుతం అంతర్జాతీయంగా ధరలు తగ్గినా, గత నష్టాలను పూడ్చుకోవడం, దిగుమతి చేసుకున్న చమురు దేశానికి చేరడానికి పట్టే సమయం, రూపాయి విలువలో హెచ్చుతగ్గులు, అధిక పన్నుల వంటి కారణాల వల్ల దేశీయంగా ధరలు తగ్గడం లేదని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# వీబీజీ రామ్‌జీ చట్టాన్ని అంగీకరించం

**మొదటిపేజీ తరువాయి**

సమర్థించదని ఆయన స్పష్టం చేశారు.

వీబీజీ రామ్‌జీ పథకానికి సంబంధించిన అంశాలపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్‌కమిటీ శనివారం సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం వల్ల రాష్ట్రంపై పడే ప్రభావం, రైతులు, గ్రామీణ వర్గాలపై ఏర్పడే పరిస్థితులు, ప్రభుత్వం అనుసరించాల్సిన న్యాయ, పరిపాలనా చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మొదటి నుంచే రైతుల ప్రయోజనాలకు కట్టుబడి ఉందన్నారు. రైతుల ఆదాయం పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తరించడం, వ్యవసాయ రంగం బలోపేతం కావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. అలాంటి సమయంలో రైతులకు నష్టం కలిగించే చట్టాలను అంగీకరించే ప్రసక్తే లేదన్నారు.

వీబీజీ రామ్‌జీ చట్టం అమల్లోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని, పేదల జీవనోపాధిపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రతి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఈ చట్టాన్ని న్యాయపరంగా సవాలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ఉత్తమ్ వెల్లడించారు. చట్టంలోని నిబంధనలను నిపుణులతో పరిశీలించి, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణతో పాటు రాష్ట్ర హక్కులను కాపాడేందుకు అందుబాటులో ఉన్న అన్ని న్యాయపరమైన మార్గాలను వినియోగిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో తెలంగాణ ఒక్క రాష్ట్రంగా కాకుండా, ఇదే అభిప్రాయం వ్యక్తం చేస్తున్న ఇతర రాష్ట్రాలతో కలిసి ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు.



ముఖ్యంగా కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. అవసరమైతే ఇతర రాష్ట్రాలను కూడా ఈ పోరాటంలో భాగస్వాములను చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల సంక్షేమం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల జీవనోపాధికి విఘాతం కలిగించే ఏ నిర్ణయాన్నైనా చట్టపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా వ్యతిరేకిస్తామని చెప్పారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, వారి హక్కులను పరిరక్షించేందుకు అవసరమైన ప్రతి చర్య తీసుకుంటామని తెలిపారు.

క్యాబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో చట్టంలోని వివిధ అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు సమాచారం. చట్టం అమలైతే రాష్ట్రంలో ఉపాధి, వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం పడుతుందనే అంశాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వివిధ శాఖల నుంచి వచ్చిన నివేదికలను కూడా కమిటీ పరిశీలించింది.

ప్రభుత్వం న్యాయ నిపుణుల అభిప్రాయాలను సేకరించి తదుపరి కార్యాచరణపై తుది నిర్ణయం తీసుకోనుంది. అవసరమైతే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి వ్యూహాన్ని అమలు చేయడంతో పాటు న్యాయపోరాటాన్ని కూడా కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. రైతుల ప్రయోజనాలు, గ్రామీణ పేదల సంక్షేమం, రాష్ట్ర హక్కుల పరిరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వం తన వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. రైతులపై భారం మోపే, గ్రామీణ పేదల జీవనోపాధిని దెబ్బతీసే ఏ చట్టాన్నైనా వ్యతిరేకిస్తామని, ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని ఆయన అన్నారు.

# కేతన్ హత్య కేసులో షాకింగ్ ట్విస్ట్


**మొదటిపేజీ తరువాయి**

ఈ వివాహం చేసుకోవడం ఇష్టం లేదని చెప్పి వారిని బాధపెట్టడం కంటే, కేతన్‌ను హత్య చేయడమే సులభమని భావించినట్లు సియా విచారణలో అంగీకరించినట్లు తెలుస్తోంది. ఈ కోణంలో పోలీసులు కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

మరోవైపు కేసు విచారణను వేగవంతం చేసిన పుణె రూరల్, లోనావాలా పోలీసులు మొత్తం ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సియా గోయల్ తల్లిదండ్రులను లోనావాలా సిటీ పోలీస్ స్టేషన్‌లో విచారించగా, ఆమె సోదరుడు సాహిల్‌ను రెండోసారి ప్రశ్నించారు. శుక్రవారం దాదాపు పది గంటలపాటు సాగిన విచారణలో సాహిల్ పలు కీలక వివరాలను వెల్లడించినట్లు సమాచారం.

చేతన్ చౌదరి తనకు పరిచయమేనని, తన సోదరి సియా ఓ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా అతడిని తనకు పరిచయం చేసిందని సాహిల్ పోలీసులకు తెలిపినట్లు తెలుస్తోంది. అనంతరం గత ఏడాది ఓ ఉమ్మడి స్నేహితుడు నిర్వహించిన దీపావళి వేడుకల్లో మరోసారి కలిసిన తర్వాత సియా, చేతన్‌ల మధ్య సాన్నిహిత్యం మరింత పెరిగినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

దర్యాప్తులో భాగంగా నిందితుల కాల్ డేటా రికార్డులను విశ్లేషించిన పోలీసులు కీలక విషయాలను గుర్తించారు. ఈ ఏడాది జనవరి నుంచి సియా, చేతన్ మధ్య దాదాపు 2 వేల ఫోన్ కాల్స్



జరిగినట్లు, మొత్తం 238 గంటల పాటు వారు సంభాషించినట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ వివరాలు కుట్ర కోణాన్ని బలపరుస్తాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు.

కేసులో మరిన్ని ఆధారాలు సేకరించేందుకు నిందితులు తమ మొబైల్ ఫోన్‌ల నుంచి తొలగించిన డేటాను తిరిగి రికవరీ చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. చాట్ హిస్టరీ, కాల్ రికార్డులు, ఇతర డిజిటల్ ఆధారాలను సేకరించి హత్యకు సంబంధించిన పూర్తి కుట్రను ఛేదించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అయితే, ఈ అంశాలపై పోలీసులు ఇంకా అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# బీజేపీ నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ

- **బీజేపీ విజయానికి హైదరాబాద్ నుంచే నాంది పలుకుతామన్న రాంచందర్ రావు**
- **బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం కలిసి వచ్చినా బీజేపీని ఓడించలేవని ధీమా**
- **బీజేపీ జాతీయ నాయకత్వం తెలంగాణ వైపు చూస్తోందన్న లక్ష్మణ్**

**ప్రజాస్వరం, హైదరాబాద్**

పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ కంచుకోటను బద్దలు కొట్టి అధికారంలోకి రావడంతో దేశ వ్యాప్తంగా బీజేపీ నేతలు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తోంది. తెలంగాణ బీజేపీ శ్రేణుల్లో సైతం ఫుల్ జోష్ నెలకొంది. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ... తెలంగాణలో విజయఢంకా మోగించడమే బీజేపీ నెక్స్ట్ టార్గెట్ అని స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచే ఈ విజయానికి నాంది పలుకుతామని, వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ విజయం సాధించి చూపెడతామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం మూడు పార్టీలు కలిసి వచ్చినా సరే.. బీజేపీని ఓడించడం ఎవరి తరం కాదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రేపు హైదరాబాద్‌కు వస్తున్నారని తెలిపారు.

మరోవైపు వరంగల్ లో రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... బీజేపీ జాతీయ నాయకత్వం మొత్తం తెలంగాణ వైపే చూస్తోందని అన్నారు. ఈనెల 29న నితిన్ నబీన్ వరంగల్‌లో పర్యటిస్తారని, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో బూత్ లెవెల్ కార్యకర్తల సదస్సులో పాల్గొంటారని వెల్లడించారు. బీజేపీని కాదని కాంగ్రెస్ ను గెలిపించిన ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టయిందని అన్నారు.



# ఓటర్ల జాబితా సవరణ పై 14,15 వ వార్డులో అవగాహన...

- **పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్...**

**మెదక్ జూన్ 27(ప్రజా స్వరం)**

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా శనివారం మెదక్ పట్టణంలోని 14, 15 వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియలో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, 14 వ వార్డు కౌన్సిలర్ దొంతి లక్ష్మి ముత్యం గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ నియమించిన బీఎల్ఓ లతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల కు అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగం ప్రకారం "ఒక వ్యక్తి కి ఒకే ఓటు" అనే నినాదంతో ఓటర్ల జాబితాలో పారదర్శకత ఉండాలని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా అన్యాయంగా తొలగించబడకుండా చూడాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







# తూప్రాన్ గురుకుల బాలుర పాఠశాల కు స్పెషల్ అఫీసర్ గా శ్రీకాంత్

**తూప్రాన్ జూన్ 27 ప్రజా స్వరం**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలకు ప్రత్యేక అధికారులను నియమించారు అందులో భాగంగా తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద గల అల్లాపూర్ శివారులో గల తెలంగాణ బాలుర గురుకుల జూనియర్ కళాశాల మరియు పాఠశాల కు తూప్రాన్ డైప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్ ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు.. వెంటనే
తూప్రాన్ (అల్లాపూర్)లోని పీఎం శ్రీ టీజీ ఆర్జేసీ (PM SHRI TGRJC బాలుర) గురుకుల పాఠశాలను శనివారం ప్రత్యేక అధికారి ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్శనలో భాగంగా పాఠశాల ప్రాంగణం, వంటగది (కిచెన్), మరియు స్టాక్ రూమ్‌లన ప్రత్యేక అధికారి శ్రీకాంత్ నిశితంగా పరిశీలించారు
ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి గా .. తనిఖీలో ఎలాంటి పెద్ద లోపాలు కనిపించలేదు, ప్రాంగణం సంతృప్తికరంగా ఉంది. అయితే, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో



ఉంచుకుని, కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించడం జరిగింది ,విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వంటగది, పరిసరాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని పాఠశాల సిబ్బందికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిన స్పెషల్ అఫీసర్



# పేకాట స్థావరంపై పోలీసుల దాడి.....

ఐదుగురు అరెస్టు..11,230 నగదు, ఐదు ఫోన్లు స్వాధీనం....
జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు...
మెదక్ జూన్ 27 (ప్రజా స్వరం)
శివ్వంపేట మండలం గంగాయిపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం దాడి నిర్వహించిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో ఇటిక్యాల రేవంత్ రెడ్డి, బానోత్ కంద్యా, నల్ల పేరమాన్లు, జిట్ల సత్యనారాయణ, ఎ. ప్రశాంత్ ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.11,230 నగదుతో పాటు ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో జూదం, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగుతోందని తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో జరిగే అక్రమ కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.



# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి.....

- **ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి....**
- **గుడిసెలలో నివాసం ఉండే వారిని గుర్తించి నివేదిక అందించాలి.....**
- **నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు....**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్....**

**మెదక్ జూన్ 27 (ప్రజా స్వరం)**



నిరుపేదలకు నీడ కల్పించాలన్నా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ అన్నారు. శనివారం మెదక్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆయా మండలాల వారీగా సమీక్షిస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాకు మంజూరైన (8953) ఇళ్లకు గాను 81 % (7271) ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తి అయిందని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ పర్యటించి, నిర్మాణాలు వేగవంతం అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వారం స్టేజీ ల వారీగా ఇళ్లను తుది దశకు పురోగతిలోకి తీసుకురావాలన్నారు. ఇసుక, గ్రావెల్ విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణ అధికారులను ఆదేశించారు. ఇప్పటికీ ప్రారంభించని ఇండ్లను వెంటనే ప్రారంభించి జూలై 15 వరకు పూర్తి చేయాలన్నారు ప్రతి రోజూ ఎన్ని ఇళ్లు పూర్తి అవుతున్నాయన్న అంశం మీద సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి ఇండ్లు నిర్మించుకోలేని నిరుపేదలు మహిళా స్వయం సహాయక సభ్యులుగా ఉన్నట్లయితే డి ఆర్ డి ఓ ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేసి ఇండ్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డి ఆర్ డి ఓ ను ఆదేశించారు.రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఇప్పుడు గుడిసెలో నివసించే వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకు పోతున్నామన్నారు. రాష్ట్రాన్ని గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వ ఆదేశాలతో అన్ని గ్రామాలు, నగర జనాభా ప్రాతిపదికన ఇళ్లు కేటాయించి లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు
ఇందుకుగాను ప్రత్యేక అధికారులు జిల్లాలోని ఆయా మండలాల్లో గుడిసెల్లో నివసించే వారిని త్వరితగతిన గుర్తించి నివేదికలు అందజేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి



ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్స్ డిఈలు, ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ జూలై 1 నుంచి చెత్త ను వేరు చేసి ఇవ్వాలి....

- **చెత్తను నాలుగు విభాగాలుగా విడదీసి తీసుకోవాలి...**
- **సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్-2026 అమలుకు కార్యాచరణ....**
- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్..**

**మెదక్ జూన్ 27 (ప్రజా స్వరం)**



జూలై ఒకటవ తేదీ నుంచి జిల్లాలో చెత్త వేరు చేసి తీసుకోవాలి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం మెదక్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘన వ్యర్థాల నిర్వహణ పై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జులై ఒకటవ తేదీ నుంచి చెత్తను వేరు చేయకుండా ఇవ్వరాదన్నారు. ఇండ్లలోని వ్యర్థాలను తడి చెత్తను గ్రీన్ డబ్బాలో, పొడి చెత్తను బ్లూ డబ్బాలో, సానిటరీ చెత్తను రెడ్ డబ్బాలో, హానికరమైన చెత్తను బ్లాక్ డబ్బాలలో విడదీసి, వేరువేరుగా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హోటల్స్, హాస్టల్స్, పరిశ్రమలు, రెస్టారెంట్లు, ధాబాలు, హాస్పిటల్స్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు సొంతంగా వ్యర్థాల నిర్వహణ చేసుకోవాలన్నారు. వాటన్నింటికీ ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో చెత్త సేకరణ కోసం నాలుగు వేరు వేరు డబ్బాలు ఏర్పాటు చేయాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ 2026 అమలుకు కార్యాచరణ శాఖల సమన్వయం తప్పనిసరి జిల్లాలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నియమాలు 2026 ను సమర్థవంతంగా అమలు చేసి పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నాగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు, ఎంపీడీవోలు, ఏపీవోలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ నాలుగో వార్డ్ లో కమిషనర్ పర్యటన....

**తూప్రాన్ జూన్ 27 ప్రజస్వరం**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్పరిధి లోని నాలుగో వార్డ్ లో పర్యటించిన మున్సిపల్ కమిషనర్ నాలుగో వార్డ్ కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్... గత మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వీధుల్లో డ్రైనేజీ లోపం ఏర్పడిందని డ్రైనేజ్ పై మాట్లాడినారు. తక్షణమే స్పందించిన మున్సిపల్ కమిషనర్ డబుల్ బెడ్ రూమ్ వీధుల్లో నాలుగవ వార్డు వీధుల్లో పర్యటించి పరిశీలించారు . వార్డులోని పలు మురికివాడలను ఓపెన్ మురికి నీళ్లలో నిలువ ఉండకుండా ముందు చర్యలు తీసుకోవాలని త్వరగా పూర్తి చేయాలని వార్డులు ఇలాగే కొనసాగితే ప్రజలు ఆస్పత్రిల పాలవుతారని వర్షా కాలం దృశ్య ప్రజలకు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని నాలుగో వార్డ్ కౌన్సిలర్ కమిషనర్ తో తెలిపారు. తక్షణమే పరిశుద్ధ పనులు చేపడతామని మున్సిపల్ కమిషనర్ హామీ ఇచ్చారు.



## పసికూన ఐర్లాండ్ చేతిలో భారత్‌కు షాక్.. మధ్య ఓవర్లలోనే పట్టు కోల్పోయామన్న కెప్టెన్




- **ఐర్లాండ్‌తో తొలి టీ20 మ్యాచ్‌లో భారత్ ఘోర పరాజయం**
- **34 పరుగుల తేడాతో గెలిచి చరిత్ర సృష్టించిన ఐర్లాండ్**
- **మధ్య ఓవర్లలో పట్టు కోల్పోవడమే ఓటమికి కారణమన్న కెప్టెన్ అయ్యర్**
- **గాయం నుంచి కోలుకున్న హర్షిత్ రాణా బౌలింగ్‌పై ప్రశంసలు**

ప్రజాస్వరం:


పసికూన ఐర్లాండ్ చేతిలో భారత క్రికెట్ జట్టుకు ఊహించని పరాభవం ఎదురైంది. శుక్రవారం జరిగిన రెండు టీ20ల సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో భారత్‌పై ఐర్లాండ్ 34 పరుగుల తేడాతో చారిత్రక విజయం సాధించింది. టీ20 ఫార్మాట్‌లో టీమిండియాపై ఐర్లాండ్‌కు ఇదే తొలి గెలుపు కావడం గమనార్హం. కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లోనే ఓటమిని చవిచూసిన శ్రేయస్ అయ్యర్, మ్యాచ్ అనంతరం ఓటమికి గల కారణాలను విశ్లేషించారు.

ప్రారంభంలో బౌలర్లు అద్భుతంగా రాణించినప్పటికీ, మధ్య ఓవర్లలో పట్టు కోల్పోవడం వల్లే మ్యాచ్ చేజారిందని అయ్యర్ అంగీకరించారు. "తొలి ఓవర్లలో మా బౌలర్లు మంచి స్వింగ్ రాబట్టి వికెట్లు తీశారు. మాకు గొప్ప ఆరంభమే లభించింది. కానీ మధ్య ఓవర్లలో మా ప్రణాళికలను సరైన రీతిలో అమలు చేయలేకపోయాం. మైదానం తక్కువ దూరం ఉన్న వైపు ఐర్లాండ్ బ్యాటర్లు షాట్లు కొట్టేలా అవకాశం ఇచ్చాం" అని అయ్యర్ తెలిపారు.

అయితే, చివరి ఓవర్లలో బౌలర్లు మళ్లీ పుంజుకుని ఐర్లాండ్‌ను కట్టడి చేశారని, 182 పరుగుల లక్ష్యం ఛేదించదగినదేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ఓటమి నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకున్నామని, ఆదివారం జరిగే రెండో మ్యాచ్‌లో సర్వశక్తులు ఒడ్డి పోరాడతామని ధీమా వ్యక్తం చేశారు.

గాయం నుంచి కోలుకుని జట్టులోకి పునరాగమనం చేసిన హర్షిత్ రాణా (3/24) అద్భుతంగా బౌలింగ్ చేశాడని అయ్యర్ కొనియాడారు. ఆల్‌రౌండర్ శివం దూబేకు కూడా ఆయన మద్దతుగా నిలిచారు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఏ జట్టునూ తక్కువగా అంచనా వేయలేమని, గెలవాలంటే నిరంతరం కష్టపడాల్సిందేనని ఈ ఓటమి గుర్తు చేసిందని అయ్యర్ వ్యాఖ్యానించారు. ఇరు జట్ల మధ్య రెండో, ఆఖరి టీ20 ఆదివారం ఇదే వేదికపై జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను 11తో సమం చేయాలని భారత్ పట్టుదలగా ఉంది.

## '13 సిక్సర్లు కొడతా అన్నాడు'.. వైభవ్ గురించి ఆసక్తికర విషయం చెప్పిన సంగక్కర




- **ఐపీఎల్‌లో జరిగిన ఆసక్తికర విషయం పంచుకున్న సంగక్కర**
- **లక్నోతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ ఆత్మవిశ్వాసానికి సంగక్కర ఫిదా**
- **13 సిక్సులు కొడతా అని బరిలోకి దిగినట్లు వెల్లడి**
- **ఆ మ్యాచ్‌లో 10 సిక్సులు కొట్టి 93 పరుగులు చేసిన వైభవ్**
- **221 పరుగులు ఛేదించి గెలిచిన రాజస్థాన్ రాయల్స్**
- **వైభవ్ ఆత్మవిశ్వాసం అతడి వయసుకు మించినదని సంగక్కర ప్రశంస**

ప్రజాస్వరం:

15 ఏళ్ల క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆత్మవిశ్వాసానికి తాను కూడా ఆశ్చర్యపోయానని రాజస్థాన్ రాయల్స్ ప్రధాన కోచ్ కుమార సంగక్కర వెల్లడించాడు. ఐపీఎల్2026లో లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌కు ముందు వైభవ్ చెప్పిన మాటలను ఆయన తాజాగా గుర్తు చేసుకున్నాడు.

221 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాల్సిన మ్యాచ్‌కు ముందు డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చిన వైభవ్.. "కోచ్, టెన్షన్ పడొద్దు.. మ్యాచ్ మనదే" అని కన్నుగీటాడని సంగక్కర తెలిపాడు. ఆ తర్వాత సహచరులు డోనోవన్ ఫెరీరా, లువాన్‌డ్రే ప్రిటోరియస్తో మాట్లాడుతూ.. "నేను ఈరోజు 13 సిక్సర్లు కొడతా.. మిగతాది మీరు చూసుకోండి" అని చెప్పాడని గుర్తుచేశాడు

మొదట అతడి మాటలను సరదాగా తీసుకున్న సహచరులు.. ఒక్కో సిక్సర్ కొడుతూ పోతుండగా నిజంగానే లెక్కపెట్టడం ప్రారంభించారని సంగక్కర చెప్పాడు. చివరకు వైభవ్ 13 సిక్సర్లు కాకపోయినా 10 సిక్సర్లు బాది 48 బంతుల్లో 93 పరుగులు చేసి రాజస్థాన్ విజయానికి బాటలు వేశాడు. ఆ మ్యాచ్‌లో రాజస్థాన్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

వైభవ్ ఆత్మవిశ్వాసం, ఒత్తిడిని ఎదుర్కొనే తీరు అతడి వయసుకు మించినదని సంగక్కర ప్రశంసించాడు. ఐపీఎల్2026లో 776 పరుగులతో ఆరెంజ్ క్యాప్ గెలిచిన వైభవ్.. 72 సిక్సర్లు బాది క్రిస్ గేల్ పేరిట ఉన్న 59 సిక్సర్ల రికార్డును కూడా అధిగమించాడు.

# హార్దిక్ పాండ్యా సీక్రెట్‌గా రెండో పెళ్లి చేసుకున్నాడా?.. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటో!




- **హార్దిక్ పాండ్యా, మహీకా శర్మ రహస్య వివాహం చేసుకున్నారంటూ ప్రచారం**
- **పాపిట సిందూరంతో కనిపించిన మహీకా ఫొటో వైరల్**
- **ఈ వార్తలపై ఇప్పటివరకు స్పందించని హార్దిక్, మహీకా**
- **గత ఏడాది నుంచి రిలేషన్‌షిప్‌లో ఉన్న ఈ జంట**

ప్రజాస్వరం:

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వ్యక్తిగత జీవితం మరోసారి వార్తల్లో నిలిచింది. తన ప్రియురాలు, మోడల్ మహీకా శర్మను హార్దిక్ రహస్యంగా వివాహం చేసుకున్నారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. పాపిటలో సిందూరంతో మహీకా శర్మ కనిపిస్తున్న ఒక ఫొటో ఇంటర్నెట్‌లో వైరల్ కావడమే ఈ ఊహాగానాలకు కారణమైంది.

సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ ఫొటోలో హార్దిక్ పాండ్యా, మహీకా శర్మ పక్కపక్కనే నిల్చుని ఉన్నారు. వారి చేతులను ఒక వృద్ధురాలు పట్టుకుని ఉండగా, మహీకా పాపిటలో సిందూరం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఫొటో బయటకు రావడంతో వారిద్దరూ రహస్యంగా పెళ్లి చేసుకున్నారని, అందుకే మహీకా సంప్రదాయబద్ధంగా సిందూరం ధరించిందని పలువురు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. కొద్ది గంటల్లోనే ఈ ఫొటో వైరల్ కావడంతో హార్దిక్ పెళ్లి వార్త హాట్ టాపిక్‌గా మారింది.

అయితే, ఈ వార్తల్లో ఎంతమాత్రం నిజం లేదని తెలుస్తోంది. వారి వివాహం జరిగినట్లు ఎలాంటి అధికారిక సమాచారం లేదు. ఈ ప్రచారంపై హార్దిక్ పాండ్యా గానీ, మహీకా శర్మ గానీ ఇప్పటివరకు స్పందించలేదు. కేవలం ఒక ఫొటోను ఆధారం చేసుకుని వస్తున్న ఈ వార్తలను నమ్మలేమని పలువురు అభిప్రాయపడుతున్నారు. గత ఏడాది కాలంగా తమ సంబంధం గురించి బహిరంగంగానే ఉంటూ వస్తున్న ఈ జంట, నిజంగా పెళ్లి చేసుకుంటే ఆ విషయాన్ని కచ్చితంగా అభిమానులతో పంచుకునే వారని చాలామంది భావిస్తున్నారు. బహుశా ఏదైనా ప్రైవేట్ ట్రిప్‌లో భాగంగా వారు కలిసిన వృద్ధురాలితో ఈ ఫొటో తీసుకుని ఉండవచ్చని కూడా వాదనలు వినిపిస్తున్నాయి.

2024 జులైలో సెర్బియన్ నటి, మోడల్ నటాషా స్టాంకోవిచ్‌తో విడాకులు తీసుకున్నప్పటి నుంచి హార్దిక్ పాండ్యా వ్యక్తిగత జీవితం నిరంతరం మీడియా దృష్టిని ఆకర్షిస్తోంది. 2020లో వివాహం చేసుకున్న ఈ జంటకు అగస్త్య అనే కుమారుడు ఉన్నాడు. విడాకుల తర్వాత ఇద్దరూ కలిసి తమ కుమారుడి బాధ్యతలను చూసుకుంటున్నారు.

**రిలేషన్‌షిప్‌లో హార్దిక్, మహీకా**

2025 సెప్టెంబర్‌లో మహీకా శర్మ ఇన్‌స్టాగ్రామ్ పోస్టులలో హార్దిక్ పాండ్యా కనిపించడంతో వీరిద్దరి మధ్య ప్రేమాయణం సాగుతోందనే పుకార్లు మొదలయ్యాయి. ఆ తర్వాతి నెలలోనే అంటే అక్టోబర్‌లో ఈ జంట తమ బంధాన్ని సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించారు. అప్పటి నుంచి తరచుగా తమ ఫొటోలు, వీడియోలను పంచుకుంటున్నారు. ఐపీఎల్ 2026 సీజన్‌తో పాటు టీ20 ప్రపంచ కప్ 2026 వంటి అంతర్జాతీయ మ్యాచ్‌లలో కూడా హార్దిక్‌ను ఉత్సాహపరుస్తూ మహీకా స్టేడియంలో కనిపించింది. ప్రస్తుతానికి వైరల్ ఫొటోతో పెళ్లిపై చర్చ జరుగుతున్నప్పటికీ, వారి వివాహంపై ఎలాంటి అధికారిక నిర్ధారణ లేదనేది వాస్తవం.

# ఫీఫా వరల్డ్ కప్‌లో చరిత్ర సృష్టించిన కేప్ వర్దే.. నాకౌట్‌లో అతి చిన్న దేశం



- **సౌదీ అరేబియాతో మ్యాచ్ డ్రా చేసుకుని నాకౌట్‌కు అర్హత**
- **రౌండ్ ఆఫ్ 32లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాతో తలపడనున్న కేప్ వర్దే**
- **ఈ ఘనత సాధించిన అతి చిన్న దేశంగా సరికొత్త రికార్డ్**
- **గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచుల్లోనూ ఓటమి లేకుండా నాకౌట్‌కు**

ప్రజాస్వరం:

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఓ చిన్న దేశం అద్భుతం చేసింది. తమ చరిత్రలోనే తొలిసారి ఫీఫా వరల్డ్ కప్ రౌండ్ ఆఫ్ 32కు అర్హత సాధించి కేప్ వర్దే సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. సౌదీ అరేబియాతో జరిగిన కీలకమైన గ్రూప్‌హెచ్ మ్యాచ్‌ను గోల్స్ లేకుండా 'డ్రా'గా ముగించిన కేప్ వర్దే, గ్రూప్‌లో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ఈ చారిత్రక విజయంతో జులై 3న మయామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ లియోనెల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనాతో తలపడనుంది. ఫీఫా ప్రపంచకప్ నాకౌట్ దశకు చేరిన అతి చిన్న దేశంగా కేప్ వర్దే రికార్డు సృష్టించింది.

గ్రూప్ దశలో కేప్ వర్దే ప్రదర్శన అద్భుతం. ఆడిన మూడు మ్యాచులనూ డ్రా చేసుకుని, మూడు పాయింట్లతో గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. దీంతో మాజీ ఛాంపియన్ ఉరుగ్వే, సౌదీ అరేబియా జట్లను వెనక్కి నెట్టి నాకౌట్‌కు అర్హత సాధించింది. సౌదీతో జరిగిన మ్యాచ్‌లో కేప్ వర్దే జట్టు ఆధిపత్యం ప్రదర్శించింది. విల్లీ సెమెడో, కెవిన్ పినా వంటి ఆటగాళ్లు గోల్స్ చేయడానికి చేసిన ప్రయత్నాలు త్రుటిలో విఫలమయ్యాయి. సౌదీ గోల్ కీపర్ మహమ్మద్ అల్ ఒవైస్ అద్భుతమైన సేవ్లతో జట్టును ఆదుకున్నాడు. మ్యాచ్ ముగియడానికి 15 నిమిషాల ముందు లారోస్ దువార్టే కొట్టిన షాట్‌ను ఒవైస్ అడ్డుకోవడంతో కేప్ వర్దే ఆధిక్యం కోల్పోయింది. అయినప్పటికీ, మ్యాచ్‌ను డ్రాగా ముగించి నాకౌట్ బెర్తును ఖరారు చేసుకుంది.

ఈ ఘనతతో కేప్ వర్దే మరో అరుదైన రికార్డును కూడా తన ఖాతాలో వేసుకుంది. తమ తొలి ప్రపంచకప్ గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా నాకౌట్‌కు చేరిన మూడో ఆఫ్రికన్ దేశంగా నిలిచింది. గతంలో మొరాకో (1986), కామెరూన్, నైజీరియా (1998, 2014) ఈ ఘనత సాధించాయి.

ఇతర గ్రూపుల విషయానికొస్తే, గ్రూప్‌జీలో ఈజిప్ట్‌ను ఓడించి బెల్జియం అగ్రస్థానంలో నిలిచింది. గ్రూప్‌ఏలో దక్షిణాఫ్రికా రెండో స్థానం దక్కించుకుని కెనడాతో తలపడనుంది. మూడో స్థానం పొందిన జట్లలో దక్షిణ కొరియా కూడా నాకౌట్‌కు అర్హత సాధించింది.

రౌండ్ ఆఫ్ 32కు అర్హత సాధించిన జట్లు: మెక్సికో, దక్షిణాఫ్రికా, స్విట్జర్లాండ్, కెనడా, బోస్నియా అండ్ హెర్జెగోవినా, బ్రెజిల్, మొరాకో, యునైటెడ్ స్టేట్స్, ఆస్ట్రేలియా, పరాగ్వే, జర్మనీ, కోట్ డి ఐవరీ, ఈక్వెడార్, నెదర్లాండ్స్, జపాన్, స్వీడన్, బెల్జియం, ఈజిప్ట్, స్పెయిన్, కేప్ వర్దే, ఫ్రాన్స్, నార్వే, సెనెగల్, అర్జెంటీనా, కొలంబియా, పోర్చుగల్, ఇంగ్లాండ్, ఘనా.

రేపటి నుంచి రౌండ్ ఆఫ్ 32 మ్యాచులు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా కేప్ వర్దే, అర్జెంటీనా మధ్య జరిగే మ్యాచ్‌పై ప్రపంచవ్యాప్తంగా ఫుట్‌బాల్ అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

# 'ప్రపంచ ఛాంపియన్లను ఓడించడం ఎంతో స్పెషల్': ఐర్లాండ్ కెప్టెన్




- **తొలి టీ20లో భారత్‌పై 34 పరుగుల తేడాతో ఐర్లాండ్ విజయం**
- **టీమిండియాను 148 పరుగులకే కట్టడి చేసిన ఐరిష్ బౌలర్లు**
- **రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచిన ఐర్లాండ్**

ప్రజాస్వరం:

టీ20 ప్రపంచ కప్ విజేత భారత జట్టుపై సాధించిన చారిత్రాత్మక విజయం పట్ల ఐర్లాండ్ కెప్టెన్ లార్కాన్ టక్కర్ హర్షం వ్యక్తం చేశాడు. తొలి టీ20 మ్యాచ్‌లో టీమిండియాను 34 పరుగుల తేడాతో ఓడించిన అనంతరం మాట్లాడుతూ.. "సొంత గడ్డపై, అది కూడా ప్రపంచ ఛాంపియన్లపై విజయం సాధించడం అనేది ఎంతో ప్రత్యేకమైన అనుభూతి" అని పేర్కొన్నాడు. మ్యాచ్‌లో కొన్ని కష్టమైన పరిస్థితులు ఎదురైనప్పటికీ, ఆటగాళ్లు ఎక్కడా సంయమనం కోల్పోకుండా పట్టుదలతో పోరాడి గెలిచారని టక్కర్ ప్రశంసించాడు.

ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్.. పవర్‌ప్లే ముగిసేసరికే 36 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి తీవ్ర ఒత్తిడిలో పడింది. ఆ సమయంలో కెప్టెన్ టక్కర్ (50), గారెత్ డెలానీ (49) కలిసి అద్భుత భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను నిర్మించారు. "ప్రారంభంలో భారత్ చాలా క్రమశిక్షణతో బౌలింగ్ చేసింది. వారు లైనప్ మార్చకుండా స్థిరమైన లెంగ్త్‌తో బంతులు వేయడంతో మాకు పరుగులు తీయడం సవాలుగా మారింది. ఒక దశలో ఇది టీ20లా కాకుండా టెస్ట్ మ్యాచ్‌లా అనిపించింది. కానీ మేము క్రీజులో నిలదొక్కుకుని, ఆ తర్వాత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నాం" అని టక్కర్ తమ వ్యూహాన్ని వివరించాడు.

అనంతరం 182 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌ను ఐర్లాండ్ బౌలర్లు 148 పరుగులకే ఆలౌట్ చేశారు. ముఖ్యంగా ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన మాట్ హాలర్డ్, జై ముంద్రాల బౌలింగ్‌ను కెప్టెన్ ప్రత్యేకంగా అభినందించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో భారత బౌలర్లు వేసిన లెంగ్త్‌లను గమనించి, తమ బౌలర్లు కూడా అదే లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారని, వారి ప్రణాళికలు నూటికి నూరు శాతం ఫలించాయని టక్కర్ పేర్కొన్నాడు.

కెప్టెన్‌గా వరుసగా రెండో హాఫ్ సెంచరీ సాధించడంపై స్పందిస్తూ.. "ఈ రికార్డులు ఎప్పుడైనా బద్దలు కావచ్చు, కానీ ప్రస్తుతానికైతే నా బ్యాటింగ్ ఫామ్ ఆనందాన్ని ఇస్తోంది" అని చెప్పాడు. ఈ విజయంతో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో ఐర్లాండ్ 10 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆదివారం జరగబోయే చివరి మ్యాచ్‌లో కూడా ఇదే జోరును కొనసాగించి, భారత్‌పై చారిత్రాత్మక టీ20 సిరీస్‌ను కైవసం చేసుకోవడమే తమ ముందున్న ఏకైక లక్ష్యమని లార్కాన్ టక్కర్ ధీమా వ్యక్తం చేశాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502036. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502036,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2007/18184, CELL : 8008609999